క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన దుర్గాలమ్మ సన్నిధిలో భారీ అన్నసమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న అలపన కనకరెడ్డి

జగదాంబ: చిన దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో దసరా ముగింపు సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఎంతో మందికి అన్నదానం చేస్తున్న కమిటీ అభినందనలు తెలిపారు. యువత సేవా కార్యక్రమాలు అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జీఎస్టీ ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన

సీతంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్టీ అంటే ఏంటి? దాని వల్ల దేశానికి, రాష్ట్రానికి కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. జీఎస్టీ ఎలా ధరలపై ప్రభావం చూపుతుందో తెలిపారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, రమణి, శ్యామల, ప్రభాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, వై.రామలక్ష్మి, కిరణ్ కుమార్, గ్లోరీ, అప్పారావు, జ్యోతి, రత్నం పాల్గొన్నారు.

ఆహో.. శాకాహారం

- ఆరోగ్యం.. ఆనందం
- రోగాలకు చెక్
- అక్టోబర్ 1 నుంచి 7 వరకు ఇంటర్నేషనల్ వెజిటేరియన్ వీక్



పసందైన శాకాహార భోజనం

డాబాగార్డెన్స్: ఏటా అక్టోబర్ ఒకటిన శాకాహార దినంగా పాటిస్తారు. అలాగే 1–7 తేదీల వరకూ ఇంటర్నేషనల్ వెజిటేరియన్ వీక్ నిర్వహిస్తారు. కొన్ని దేశాల్లో అయితే శాఖాహారంపై అవగాహన పెంపొందించేందుకు ఈ నెలంతా వెజ్ క్యాంపెయిన్ నిర్వహిస్తారు. సిటీలో కూడా వెజ్ క్యాంపెయిన్ ఒక ఉద్యమంలా నడుస్తోందని చెప్పక తప్పదు. శాకాహారం తీసుకునే వారికి అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు చేకూరుతాయన్న డైటీషియన్ల సూచనలతో చాలా మంది మాంసాహారానికి స్వస్తి చెప్పి శాకాహార ప్రియులుగా మారుతున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని అనేక మంది దుర్గమ్మ భక్తులు మాంసాహారానికి స్వస్తి చెప్పగా.. నెల రోజుల పాటు శాకాహారమే ముద్దంటు యువకులు మాంసాహారానికి దూరంగా ఉన్నారు.

పెరుగుతున్న శాకాహార రెస్టారెంట్లు..

ఆహారం ఎంపికలోనే ఆరోగ్యం దాగి ఉంది. మారిన నగర జీవన శైలిలో రోగాలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా నగరవాసి ఆలోచనల్లోనూ మార్పు వస్తుంది. కాలానుగుణంగా వచ్చే మార్పులకు తగ్గట్టుగా ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. నగరంలో ఆహారపు అలవాట్లు, అభిరుచుల్లో వస్తున్న మార్పులను అనుసరించి శాకాహార రెస్టారెంట్‌లు రుచికరమైన వంటకాలను అందిస్తున్నాయి.

ఆకుకూరలతో కలిగే మేలు..

ఆకుకూరల్లో పోషక పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. అందుకే శరీర పెరుగుదల, దృఢత్వానికి, చక్కని ఆరోగ్యానికి ఇవి చాలా ముఖ్యమైనవి. పాలకూర, తోటకూర, గోంగూర, మెంతికూర, పుదీన వంటివి ఎంతో శ్రేయస్కరం. ఆకు కూరలు, పండ్లలో కాపర్, మెగ్నీషియం వంటి ఖనిజాలు, లవణాలు ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేసే ఫ్లేవనాయిడ్స్ లభిస్తాయని డైటీషియన్ డాక్టర్ స్వప్న సూచిస్తున్నారు. మాంసాహారం మితిమీరి తీసుకోవడం వల్ల ఎన్నో జీర్ణకోశ వ్యాధులు వస్తాయని, ఆకు కూరల వినియోగం వల్ల మధుమేహ వ్యాధి అదుపులో ఉంటుందని ఆమె తెలిపారు. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించగల మెంతులు ఎంతో ప్రయోజనకరమని డయాబెటీషియన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శాకాహారంలోని పీచు వల్ల మొలలు, స్థూలకాయం, డయాబెటీస్, మలబద్ధకం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, పిత్తాశయంలో రాళ్ల వంటి అనేక వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చర్మ సౌందర్యానికి పోషణ, విటమిన్స్ లభిస్తాయని అంటున్నారు. బీపీ నియంత్రణలో ఉండడం, గుండె జబ్బులకు ఆస్కారం లేకపోవడం వంటి ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు సూచిస్తున్నారు.



పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆకు కూరలు, కూరగాయలు



రైతుబజార్‌లో పుష్కలంగా కూరగాయలు

ఆరోగ్యానికి ధోకా ఉండదు..



మొదట్లో మాంసాహారం లేకపోతే ముద్ద దిగేది కాదు. నాకు తెలియకుండానే దీనిపై క్రమేణా విరక్తి కలిగి ప్రస్తుతం వంకాయి, పాలకూర, బీరకాయ పీచు కూరలనే తింటున్నాను. ముఖ్యంగా ఆకు కూరల్లో పుదీన, పాలకూర, గోంగూర, తోటకూరలంటే మరీ ఇష్టం.

– బండారు లోకేష్‌కుమార్, దిబ్బలపాలెం

మాంసాహారానికి గుడ్‌బై..



నేను చికెన్ అంటే చాలా ఇష్టంగా తినేవాడిని. క్రమేణా దీనివల్ల కలిగే అనర్థాలను డైటీషియన్ల ద్వారా తెలుసుకున్నాను. అప్పటి నుంచి శాకాహారంలోకి దిగిపోయా. దీనివల్ల ఎన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనాలు పొందగలుగుతున్నాను.

– కట్టా యశ్వంత్, మహారాణిపేట

సంపూర్ణ ఆరోగ్యంపై యువత మొగ్గు..



కాలానుగుణంగా వచ్చే మార్పులకు తగ్గట్టుగా ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి యువత ఆసక్తి చూపుతున్నారు. నగరంలో ఆహారపు అలవాట్లు, అభిరుచుల్లో వస్తున్న మార్పులను అనుసరించి శాకాహార రెస్టారెంట్లు రుచికరమైన వంటకాలను అందిస్తున్నాయి.

– ఎస్ శ్రీనివాసరాజు (రాజేష్), ఎంసీపీ

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి

- జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అప్పలనారాయణ



మాట్లాడుతున్న అల్లి అప్పలనారాయణ

డాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీని వల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులోని జేపీ ఆఫ్‌షోర్‌లో పని చేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎం. కుమార మంగళం మాట్లాడుతూ నెలకు రూ. 17,524 వేతనం అయితే రూ. 14,500 ఇస్తున్నారని, 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవులు ఇవ్వడం లేదని, వీక్లీ ఆఫ్ అమలు చేయడం లేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్మికులను ఆపేయడం చట్ట వ్యతిరేకమన్నారు. జేపీ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను ఆపేసిందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ముఖ్యంగా పండగ ముందు రోజు కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపేసిందన్నారు. ఈ యాజమాన్యంపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి. జగన్, నాయకులు శ్రీను, తాతలు, అచ్యుత్, తరుణ్, కొర్లయ్య, ముత్రాజు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం



రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం (25వ వార్షికోత్సవం) శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కనక మహాలక్ష్మి దేవాలయం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకుడు, ప్రేమసమాజం అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన 'మెలోడీ సాంస్కృతిక వైభవం' రజతోత్సవ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సంస్కృతికి, సంగీతానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నో సంగీత కార్యక్రమాలు నిర్వహించి ఎందరో వర్ధమాన కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ నిర్వాహకులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, కడలిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కన్వీనర్ కడలి వీరాస్వామి, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, ఎం.పుండరీకుమార్, ఎస్.విజయకుమార్, సీహెచ్ చిట్టిబాబు, కొణతాల రాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, చీరాల ఉష, కె.అరుణకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. యువరత్న నటరత్న పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది.

మ్యాస్ట్రో శంకర్ ప్రకాష్‌కు సత్కారం



శంకర్ ప్రకాష్‌ను సత్కరిస్తున్న సెయింట్ ఆంథోనీ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: ఈమని శంకర శాస్త్రి అవార్డు గ్రహీత, సెయింట్ ఆంథోనీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ప్రముఖ వీణా విద్వాన్ మ్యాస్ట్రో బొనాల శంకర ప్రకాష్‌ని సెయింట్ ఆంథోనీ హైస్కూల్ 1980 బ్యాచ్ మిత్ర బృందం శనివారం ఘనంగా సత్కరించింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏపీఎస్‌ఈబీ కాలనీ అసోసియేషన్ చైర్మన్, పూర్వ విద్యార్థి కొండ్రు రామారావు అధ్యక్షతన నిర్వహించిన సత్కార కార్యక్రమంలో శంకర్ ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల మిత్ర బృందం నిర్వాహకుడు, న్యాయవాది నిష్టల విజయ శంకర్, ముత్య సత్యనారాయణ, వడలి శ్రీనివాసరావు, బి. శ్రీనివాస రామారావు, ఈపీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్ బుగత గురునాథ్ సహాయ సహకారాలు అందివ్వగా, ఆ బ్యాచ్ విద్యార్థులు కైపా రవిశంకర్, అజయ్ జవహర్, అర్జునరావు, సూర్యప్రకాష్, కెన్నడీ, శంకర్ నీలంశెట్టి, బొలనంద గిరి, సింగంపల్లి ముకుందరావు, కొప్పల రామారావు, బ్రహ్మం, లగుడు విజయ్‌కుమార్, బొమ్మిడి రమణ, రామకృష్ణ పాత్రో, మోహన్, చిన్నారావు, లంక వెంకట్రావు, శరత్, శామ్యూల్, ధూళి ప్రకాష్, మౌళి, శ్రీనివాస వర్మ, ఏయూ ప్రొఫెసర్ పంచాగ్నుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాలరిపేట బాధితులకు పరామర్శ



క్షతగాత్రుల బంధువులతో మాట్లాడుతున్న బీజేపీ నేత వెంకటరావు

మహారాణిపేట: జాలరిపేటలో శనివారం తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని బీజేపీ నాయకుడు, బీసీ నేత మూల వెంకట్రావు పరామర్శించారు, రాజేంద్రప్రసాద్ వార్డు బయట ఉన్న తల్లిదండ్రులను ఓదార్చారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పిల్లలు త్వరగా కోలుకోవాలని దుర్గాదేవిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

సాంకేతిక రంగాల్లో నైపుణ్యాల ప్రోత్సాహం

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలో శనివారం గ్లోబల్ హ్యాకథాన్ నాసా ఇంటర్నేషనల్ యాప్స్ చాలెంజ్–2025 నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథి ఎస్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, పరిశోధకులను ప్రేరేపిస్తూ సమాజ సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. లెర్న్, లాంచ్, లీడ్ అంశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, జి.ఎస్.కె.చక్రవర్తి పాల్గొన్నారు.

ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ఘన నివాళి



చీరలు పంపిణీ చేస్తున్న యాసీన్ బాబ్జీ



ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము, రమేష్



అన్నదానం చేస్తున్న మాజీ వుడా చైర్మన్ రవి తదితరులు

జగదాంబ: దివంగత నేత ద్రోణంరాజు శ్రీనివాస్ నాల్గవ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ 39వ వార్డు మైనార్టీ సెల్ నాయకులు యాసీన్ బాబ్జీ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వార్డులో శనివారం ఆయన పేదలకు చీరలు, టీషర్ట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత నగరంలో ద్రోణంరాజు శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, సలీం, కమాల్, వెంకటి, సత్య, మాధురి, బుజ్జి, ఇబ్రహీం బాయ్, రాజేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరివీధిలో..

అల్లిపురం: కుమ్మరివీధిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు పచ్చిరిపల్లి రాము, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో ద్రోణంరాజు శ్రీనివాస్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ రెడి, నానాజీ, పి.సూరినాయుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ నాయకుడు బడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో..

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు వర్ధంతిని పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో శ్రీనివాసరావు తనయుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మాజీ వుడా చైర్మన్ రవి ముందుగా ద్రోణంరాజు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పోలవరపు అప్పలకొండ, సత్తిబాబు, జగ్గుపల్లి అప్పలరాజు, ద్రోణంరాజు అభిమానులు పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ వెలుగుల్లో సత్యదేవుని ఆలయం



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యత గల ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో 7వ తేదీన జరగనున్న ఆశ్వీయుజ పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. వేకువజాము 4 గంటలకు ధ్వజస్తంభం పూజలు, అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఉదయం 7 నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 4.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10 వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నట్టు చెప్పారు. ప్రత్యేక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనేదలిచే భక్తులు రూ.1,116, ఉదయం 8.30 గంటలకు నిర్వహించే వ్రతంలో పాల్గొనే వారు రూ.516 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో తెలిపారు.

వాహన చోదకులకు విజ్ఞప్తి..

కేజీహెచ్ మీదుగా ఆలయానికి వచ్చే వాహన మార్గం మూసి వేయబడిందని, వాహన చోదకులు పూర్ణామార్కెట్, దయారాం స్వీట్ షాపు పక్క నుంచి నిర్మించిన ఘాట్ రోడ్డు మార్గం ద్వారా మాత్రమే స్వామి ఆలయానికి రావాలని ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

నరవ ఐటీఐ టాపర్ రాహుల్‌కు అభినందన



రాహుల్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఐఎంసీ చైర్మన్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

కంచరపాలెం: కంచరపాలెం నరవ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్–2025 పరీక్షా ఫలితాల్లో పి.వి.ఎస్.రాహుల్ అనే విద్యార్థి డీజిల్ మెకానికల్ ట్రేడ్‌లో 594/600 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శనివారం నరవ ఐటీఐ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ బి.ప్రభాకర్, ట్రైనింగ్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి రాహుల్‌ను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులతో దర్శనం క్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, అన్నప్రసాద భవనం, గంగధార, మాడ వీధులు కిటకిటలాడాయి. సుమారు 41 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా రూ. 30 లక్షల 98,300 ఆదాయం వచ్చింది.

విదేశీ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విదేశీ విద్యార్థుల ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు

మద్దిలపాలెం: విదేశీ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల (ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఆకాంక్షించారు. ఏయూలో వివిధ దేశాల నుంచి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో అడుగేయాలని విదేశీ విద్యార్థులకు సూచించారు. ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం అనేక దేశాలతో తమ స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన నియమావళి, వివరాలను తెలియజేశారు. ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, వారి భావాలు, ఆలోచనలను స్వాగతించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఏయూ పరంగా కళాశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ తరఫున కొత్తగా ప్రవేశం పొందిన సుమారు 300 మంది అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు.

కక్కా.. ముక్కా దసరా నేడే



దసరా రెండు రోజుల కిందటే ఆధ్యాత్మికంగా ముగిసిపోయింది. కక్కా, ముక్కతో కూడిన దసరా పండగను నగర ప్రజలు ఆదివారం నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గొర్రెలు.. మేకలు విక్రయించే వాహనం మరమ్మతులకు గురైంది. అయినప్పటికీ విశాఖ వాసులకు గొర్రెలు.. మేకలు ఆదివారం నాటికి ఎలాగైనా అందజేయాలన్న తపనతో ఓ ఆటో సాయంతో మరమ్మతుకు గురైన వాహనాన్ని తాడుతో తీసుకెళ్తున్న దృశ్యం సాక్షి కంటపడిందిలా..

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం